సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



గంజాయి స్వాధీనం

పెదబయలు మండలంలో ఆరుగురు యువకుల నుంచి నాలుగు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో



ప్రయాణం.. భయం భయం

ముంచంగిపుట్టు మండలంలోని మత్స్యగెడ్డలో నాటు పడవలపై ప్రయాణం భయం భయంగా మారింది. 9లో



ఆటాడుకుందాం రా..!

ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం.. అన్నింటికీ అనువుగా పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. 8లో

న్యూస్‌రీల్

వ్యాన్, ఆర్టీసీ బస్సు ఢీ

● ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలు



కొండగుడ మలుపువద్ద ఢీకొన్న, వ్యాన్ ఆర్టీసీ బస్సు

అనంతగిరి: మండలంలోని కొండగుడ సమీపంలోని మలుపు వద్ద ఆదివారం వ్యాన్ ఆర్టీసీ డీలక్స్ బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం నుంచి అరకులోయ వైపుగా ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సు, మైదాన ప్రాంతం వైపుగా వెళుతున్న వ్యాన్ కొండగుడ సమీపంలో ఎదురెదురుగా వచ్చేసరికి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్, బస్సు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

భవనంపై కూలిన భారీ వృక్షం



కూలిన భారీ వృక్షం

చింతపల్లి: మండల కేంద్రమైన చింతపల్లి ప్రధాన మార్గంలో పూర్వపు ఎన్జీజీవో హోం రేకుల భవనంపై భారీ వృక్షం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కూలింది. ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ఈ భవనంలో ప్రస్తుతం కరాటే క్లబ్ నడుస్తోంది. పక్కనే కోళ్ల దుకాణం ఉంది. నిత్యం జనసంచారం అధికంగా ఉండే ఈ ప్రాంతంలో ఉన్నట్టుండి భారీ వృక్షం పెద్ద శబ్దంతో పడిపోవడంతో స్థానికులంతా ఒక్కసారిగా హడలిపోయారు. చెట్టు కూలిపోవడంతో భవనం ధ్వంసం అయినట్టు క్లబ్ నిర్వాహకుడు బాకురు పాండురాజు తెలిపారు.

పెదబయలులో వడగళ్ల వాన



పెదబయలులో కురుస్తున్న వర్షం

పెదబయలు: మండలంలో ఈదురుగాలులు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం మారిపోయింది. భారీగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

నిలిచిన మిర్చికోత పనులు

ఎటపాక: మండలంలో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలోని గొరిదేవిపేట, గన్నవరం, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక ప్రాంతాల్లో వర్షం కారణంగా మిర్చి కోత పనులు నిలిచిపోయాయి. కోసిన చోట మిర్చి కాయలు తడిచిపోయాయి. గన్నవరం, గొరిదేవిపేట ప్రాంతాల్లో ఈదురు గాలులకు చెట్లు విరిగిపోయాయి.

బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఎటపాక: ప్రధానమంత్రి మోదీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వచ్చే నెల నాలుగో తేదీన చింతూరులో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు సంబంధించి పోస్టర్లను ఆదివారం గన్నవరంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందుకూరి స్వర్ణ,సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడారు. నాలుగు మండలాల నుంచి సభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ కంటె రాజు, రాము, రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిజరూపం.. అపురూపం

● వైభవంగా అప్పన్న చందనోత్సవం
● భక్తజన సంద్రంగా మారిన సింహగిరి
● నిజరూపాన్ని తిలకించిన 2.25 లక్షల మంది భక్తులు
● పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
● తొలి దర్శనం చేసుకున్న అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు



గోపురం వద్ద అప్పన్న ఆకృతిలో పుష్పాలంకరణ



సింహగిరి ఘాట్ రోడ్డు వరకు బారులు తీరిన ఉచిత దర్శనం భక్తులు

చందనోత్సవం దృశ్యాలు 8లో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూపాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. ఏడాదికి ఒక్క రోజు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకుని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని అప్పన్న చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగుతో స్వామిపై ఉన్న 12 మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితున్ని చేశారు. తదుపరి విశేషపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసమేతంగా స్వామివారి తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం 3.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలను ప్రారంభించారు. స్వామి నిజరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి వెయ్యి కలశాలతో శ్రీ వైష్ణవస్వాములు గంగా జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. అలాగే 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలను స్వామివారికి అభిషేకించారు. తదుపరి స్వామికి విశేషంగా పూజలు నిర్వహించి తొలివిడతగా 120 కిలోల చందనాన్ని సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

చందనోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.

దర్శించుకున్న ప్రముఖులు

పలువురు ప్రముఖులు స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి పేర్ని నాని, దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.సోమయాజులు, జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ సుజాత, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ సత్యసుందర్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, నగర మేయర్ హరివెంకట కుమారి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు.

సింహాద్రినాథుడి ఆశీస్సులు ఉండాలి: మంత్రి అమర్‌నాథ్

రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. చందన స్వామి నిజరూప దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కంటే ఈ ఏడాది మెరుగైన పరిస్థితులు ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారన్నారు. వారందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించారన్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి: మంత్రి సీదిరి అప్పలరాజు

గతంలో కంటే ఈసారి ఎక్కువగా భక్తులు రావడంతో కొద్దిపాటి ఇబ్బందులు ఉన్నా ఏర్పాట్లు మాత్రం బాగా చేశారన్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆ స్వామి పాదాల చెంతన కొండదిగువ ఉన్న గురుకుల పాఠశాలలో తాను చదువుకున్నానని, తనకు సింహాద్రి అప్పన్న పేరు పెట్టారన్నారు.

ప్రతీ భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం

ప్రతీ ఒక్క భక్తుడు సంతృప్తికరంగా స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మొత్తంగా రోజంతా 2.25 లక్షల మంది భక్తులు నిజరూప దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖలు పక్కా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఘాట్‌రోడ్డులో ఒక వాహనం మరమ్మత్తులకు గురికావడంతో ట్రాఫిక్ రాకపోకలకు చిన్నపాటి అంతరాయం కలిగిందన్నారు. రెండు, మూడు స్లాట్‌ల్లో టిక్కెట్లు పొందిన భక్తులు ఒకేసారి దర్శనానికి రావడంతో రద్దీ ఏర్పడినట్టు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

భక్తులకు ఇక్కట్లు!

● అంతరాలయ దర్శనం వల్లే ఆలస్యమంటున్న భక్తులు
● అంచనాకు మించి రావడం వల్లేనంటున్న అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ఏడాదికోసారి వచ్చే చందనోత్సవం నాడు సింహాద్రి అప్పన్న దర్శన భాగ్యం కోసం భక్తులు పరితపిస్తుంటారు. అందుకే ఎక్కడెక్కడ నుంచో వ్యయ ప్రయాసలకోర్చి వచ్చారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగం, పోలీసులు విమర్శలు ఎదుర్కొన్నారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు సకాలంలో దర్శనం కల్పించక లేకపోవడం, సమన్వయ లోపం వెరసి వారి ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. అప్పన్న దర్శనానికి రూ.300, 1000, 1500 టికెట్లను ఆన్‌లైన్ ద్వారా జారీ చేశారు. ఈసారి చందనోత్సవానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారన్న అంచనాలకు మించి 2.25 లక్షల మంది వచ్చారు. రాజగోపురానికి ఒకవైపు రూ.1500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు, మరోవైపు సిఫార్సు లేఖలతో రూ.1500 టికెట్టు పొందిన వీఐపీ ప్రొటోకాల్ భక్తులకు, బస్టాండు నుంచి రూ.వెయ్యి, 300 టికెట్ల వారికి, లోవతోట నుంచి ఉచిత ప్రవేశ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రూ.1500 టికెట్టు పొందిన వారికి ఈసారి అంతరాలయం దర్శనం కల్పిస్తామనడంతో దీంతో అధిక సంఖ్యలో ఈ టికెట్ల అమ్మకాలు జరిగాయి.

వేకువజాము నుంచే..: ఆదివారం వేకువజాము 3 గంటల నుంచి దర్శనానికి అవకాశం కల్పించడం వల్ల భక్తులు క్యూలైన్లకు చేరుకోవడంతో రద్దీ మొదలైంది. అంతరాలయ దర్శనానికి ఎక్కువ సమయం పట్టడంతో ఈ క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వీరిలో ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, ప్రముఖులు ఉన్నారు. మరోవైపు ఈ రెండు క్యూలైన్ల మధ్య నుంచి వీఐపీల పేరిట వారి సంబంధీకులు గుంపులు గుంపులుగా రావడం, వారిని రాజగోపురం ద్వారా పోలీసులు అనుమతించడం క్యూలైన్లలో భక్తులకు ఆగ్రహం తెప్పించింది. తీవ్ర అసహనానికి గురైన కొంతమంది భక్తులు ఇనుప బారికేడ్లను పెకిలించి రాజగోపురం ద్వారా ప్రవేశానికి దూసుకొచ్చారు. దీంతో తోపులాటలు జరిగాయి. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అధికారులు, పోలీసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేసి ఆలయ నీలాద్రి గుమ్మం నుంచి లఘు దర్శనం కల్పించారు. అప్పట్నుంచి క్యూలైన్లు కాస్త వేగం పుంజుకున్నాయి. కలెక్టర్ మల్లికార్జున, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణతో కలిసి అంతరాలయంలోనే ఉండిపోవడంతో ఉదయం నుంచి క్యూలైన్లలో గందరగోళ పరిస్థితులను పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే పోలీసులు, దేవదాయశాఖల మధ్య సమన్వయ లోపం ఇబ్బందులకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో చందనోత్సవాలకు ధ్వజస్తంభం వద్ద నుంచి గేటు ద్వారా ప్రొటోకాల్ భక్తులను అనుమతించేవారని, ఈసారి అందుకు భిన్నంగా వేద ఆశీర్వచనం నుంచి పంపడం ఇబ్బందులకు కారణమని చెబుతున్నారు. కాగా ఆదివారం రాత్రి 11 గంటల వరకు క్యూలైన్లలో ఉన్న భక్తుల దర్శనానికి అనుమతించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు భక్తులకు మజ్జిగ, మంచినీళ్లను అందించే ఏర్పాట్లు చేశారు. భక్తులతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డుపై ఆదివారం ఉదయం నుంచే ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

అత్యంత ఘనంగా మోదమ్మ జాతర



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

● అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు
● ఆలయ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
● వచ్చే నెల 14 నుంచి నిర్వహణ
● ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: గిరిజనుల ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి జాతరను వచ్చేనెల 14 నుంచి మూడు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో జాతర పోస్టర్లను ఆలయ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. అంతకుముందు వారితోపాటు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ముత్యాలమ్మ దంపతులు అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కంటే ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిన్నయ్యదొర నేతృత్వంలో కమిటీ ప్రతినిధులు ఉత్సాహంగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన పలు సమావేశాలు నిర్వహిస్తున్నామని, అధికార యంత్రాంగం కూడా తగిన చర్యలు చేపడుతుందన్నారు. ఉత్సవ, ఆలయ కమిటీల ప్రతినిధులకు గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ,ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులు నవర కొండబాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు, ఉపాధ్యక్షుడు దేశిది బాబూరావు, వంతెన్న రాజుబాబు, మాడగల ధర్మారావు, బూరెడ్డి రాము(ఉప సర్పంచ్) ,కార్యదర్శులు లకే నానిపాత్రుడు, యాదగిరి శ్రీనివాసరావు, బోనంగి వెంకటరమణ, కోశాధికారి కటారి శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగమ్మ తల్లి ఉత్సవాలు


● కిలగాడలో 26 వరకు నిర్వహణ
● ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ



ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడలో గంగమ్మతల్లి ఉత్సవాలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం వీటిని నిర్వహిస్తారు. సోమవారం అమ్మవారి జాతర ప్రారంభమవుతుంది. మంగళవారం అమ్మవారి ఘటాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా బుడియాల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొర్రా కామేశ్వరరావు, సర్పంచ్ కె.శివశంకర్ తెలిపారు. 26వ తేదీన భక్తుల దర్శనంతో జాతర ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం,శ్రీకాకుళం జిల్లాల్లో స్థిరపడిన ఈ గ్రామానికి చెందిన ఉత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించారు.

రహదారుల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిశీలన

● రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్
● వై.రామవరం–పోతవరం రోడ్డు నిర్మించే ప్రాంతం సందర్శన



గుర్తేడు రోడ్డులో అటవీ భూమిని పరిశీలిస్తున్న రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్



సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో సూచనలిస్తున్న డీఎఫ్‌వో నరేంద్రన్

అడ్డతీగల: రక్షిత అటవీ ప్రాంతాల గుండా రహదారుల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని రంపచోడవరం డీఎఫ్‌వో జీజీ నరేంద్రన్ తెలిపారు.వై.రామవరం సెక్షన్ పరిధిలో అటవీభూమి గుండా ప్రతిపాదించిన వై.రామవరం–పోతవరం ప్రాంతాన్ని ఆదివారం అడ్డతీగల అటవీ క్షేత్రాధికారి డి.లలితకుమారి, సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7.5 కిలోమీటర్ల రోడ్డు భాగంలో 11.30 హెక్టార్లమేర అటవీ భూమి ఉందన్నారు. ఇందులో రంపచోడవరం డివిజన్‌కు చెందిన 6.58 హెక్టార్లు, నర్సీపట్నం అటవీ డివిజన్‌కు చెందిన మరో 3.72 హెక్టార్లు ఉందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ద్వారా గతంలో ఈ రోడ్డు వివరాలతో అటవీశాఖ క్లియరెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాలైన పాతకోట, గుర్తేడు తదితర పరిసర ప్రాంతాలకు వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి రావడానికి దగ్గరి మార్గం ఏర్పడుతుందన్నారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎఫ్‌వో తెలిపారు.

క్షుణ్ణంగా పరిశీలించాకే క్లియరెన్సు

కొండపోడు భూముల(ఆర్‌వోఎఫ్‌ఆర్)కు అటవీ హక్కు పత్రాల జారీకి క్షుణ్ణంగా పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వాలని రంపచోడవరం డీఎఫ్‌వో జీజీ నరేంద్రన్ అటవీ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం వై.రామవరం సెక్షన్‌లో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న భూహక్కు పథకంలో నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. అటవీ ప్రాంతంలో ఆక్రమణల నిరోధానికి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పలువురు సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రోజంతా ఎంజాయ్ చేసేలా..

● అందుబాటులోకి రానున్న కార్వాన్ పర్యాటకం
● తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించేందుకు సన్నాహాలు
● వాహనం సైజును బట్టి ప్యాకేజీలు



కార్వాన్

సాక్షి, విశాఖపట్నం : ట్రెండింగ్ టూరిజం వైపు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచ దేశాల్లోనూ, మన దేశంలో వివిధ ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటున్న కార్వాన్ పర్యాటకం ఉమ్మడి విశాఖజిల్లాలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు ఇందుకు సంబంధించి నివేదిక సిద్ధం చేశారు. టూరిజంలో సరికొత్త విప్లవానికి సన్నాహాలు చేస్తున్నారు. తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

కార్వాన్లను అందుబాటులోకి తెచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, ఆర్‌డీ శ్రీనివాస్‌పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి, నివేదికలు సిద్ధం చేశారు. లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో ప్రకృతిని ఆస్వాదించేందుకు కార్వాన్లలో టెంట్లు కూడా ఉంచాలని భావిస్తున్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కానున్న వీటికి వాహనాన్ని బట్టి ప్యాకేజీలు నిర్ణయిస్తారు.

మినీ లగ్జరీ హోమ్‌లా...

ప్రతిపాదనల దశలో ఉన్న కార్వాన్లు లగ్జరీ హోమ్‌లు మాదిరిగా అన్ని సౌకర్యాలు ఉంటాయి. లాంజ్ కమ్ బెడ్‌రూమ్, కిచెన్, రెస్ట్‌రూమ్‌లుంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టౌ, ఫ్రిడ్జ్, ఫ్రీజర్‌లో వంటగది, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్, రూఫ్‌టాప్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీలు, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వివిధ సైజుల్లో కార్వాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది. ఎంపిక చేసుకున్న వాహనాన్ని బట్టి ప్యాకేజీ ఉంటుందని పర్యాటకశాఖ చెబుతోంది.

గంజాయి కేసు దర్యాప్తు ముమ్మరం

● చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి
● పరారీలో ఉన్న ఎస్‌ఐ సత్తిబాబు కోసం గాలింపు

చింతూరు: మోతుగూడెంలో గంజాయి రవాణా కేసుకు సంబంధించి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు చింతూరు ఏఎస్పీ కేవీ.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో పరారైన ఎస్‌ఐ సత్తిబాబుతో పాటు తెలంగాణ రాష్ట్రం సారపాకకు చెందిన బాల మురళీకృష్ణ, సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరారైన ఎస్‌ఐ సత్తిబాబు ఆచూకీ కోసం రంపచోడవరం ఏఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేస్తున్నట్లు తెలిపారు. కారులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న క్రమంలో నెల్లూరు ఎస్ఈబీ అధికారులకు పట్టుబడగా నిందితులను అక్కడి అధికారులు లోతుగా విచారించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో అక్కడి ఎస్ఈబీ అధికారులు తమకు ఇచ్చిన ఆధారాల్లో ఎస్‌ఐ పాత్ర బహిర్గతం కావడంతో అతనిపై కేసు నమోదు చేశామని ఏఎస్పీ వెల్లడించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామని, దీనిలో ప్రమేయమున్న అందరిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి కొంతమంది వ్యక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై కూడా విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. చింతూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడితే తమకు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

5 కరోనా కేసుల నమోదు



మహారాణిపేట : విశాఖలో ఆదివారం ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 107 మందికి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 40కి చేరింది. ఒకరు డిశ్చార్జ్‌కాగా 40 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు వివరించారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం

పెదబయలు: మండలంలో సీతగుంట జంక్షన్‌కు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆరుగురు యువకుల నుంచి నాలుగు కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీతగుంట జంక్షన్‌లో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా సమీప ఎస్‌బీఐ జంక్షన్ వద్ద పాడుబడిన భవనం వద్ద ఆరుగురు యువకులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని పోలీసులు గుర్తించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ఆరుగురిలో ముగ్గురు విశాఖకు చెందిన రవితేజ, రవికుమార్, చైతన్య సాయిగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. వీరితోపాటు ముంచంగిపుట్టకు చెందిన దాసు రాజేష్, అరకు ప్రాంతానికి చెందిన చందక నాగేంద్రబాబు, కిలగాడుకు చెందిన మహదేవ్ విల్లా ఉన్నారన్నారు. వీళ్లలో ఐదుగురు మహదేవ్ విల్లా నుంచి 4 కిలోల గంజాయిని కొను గోలు చేశారన్నారు. దీనిలో విశాఖలో గంజాయి సిగరెట్లు తయారు చేసి విక్రయిస్తుంటారని ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులు ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ వివరించారు.

డివిజన్ పరిధిలో అభివృద్ధిపై సమీక్ష

తాటిచెట్లపాలెం: వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రైల్వే బోర్డు మెంబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెంబర్ రూప్ నారాయణ్ సుంకర్ పరిశీలించారు. వివిధ శాఖ అధికారులతో డీఆర్‌ఎం అనూప్ కుమార్‌సత్పతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ముందుగా విశాఖలోని రైల్ వికాస్‌నిగం లిమిటెడ్, గతిశక్తి ప్రాజెక్టు నిర్మాణ విభాగ సిబ్బందితో వివిధ పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం కేకే లైన్, విశాఖ–బొడ్డవర సెక్షన్‌లో విండో ట్రయిలింగ్ తనిఖీ నిర్వహించారు. మలుపులు, వంతెనలు, గుహలు, క్రాసింగ్స్, రెండో లైన్ పనులు, రైళ్ల వేగం, భద్రత వంటి అంశాలను ఆయన పరిశీలించారు. ట్రాక్ నిర్వహణ, ట్రాక్ అలైన్‌మెంట్ సామర్థ్యం పెంపుదల కోసం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన రైల్ మిల్లింగ్ మెషీన్‌ను బొడ్డవరలో ఆయన ప్రారంభించారు. దీని పనితీరును పరిశీలించారు.

చందనోత్సవం దృశ్యాలు


సింహగిరి బస్టాండ్‌లో భక్తజన సంద్రం


స్వామి దర్శనానికి వెళుతున్న వైవీ సుబ్బారెడ్డి దంపతులు


అప్పన్న ఆలయంలో మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తదితరులు


సింహగిరిపై ఉచిత బస్సుల వద్ద రద్దీ


చిన్నారి భుజాలపై ఎత్తుకుని దర్శనానికి వెళ్తున్న భక్తుడు


భక్తులకు తిరునామం దిద్దుతున్న దృశ్యం


స్వామివారి తలనీలాలు సమర్పించి క్యూలో దర్శనానికి వేంజేసిన భక్తులు


స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు


ఉచిత దర్శనానికి బారులు తీరిన భక్తులు


సింహగిరి ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలకు సన్నాహాలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. 1966లో ఈ పాఠశాలను ప్రారంభించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన సన్నాహ, సమన్వయ సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్ని పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఈ పాఠశాలను నాడు–నేడు పథకం ద్వారా ఎంతో అభివృద్ధి చేసిందని, ఇటీవల జూనియర్ కళాశాలను పాఠశాల ఆవరణలోనే ఏర్పాటు చేయడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు. స్వర్ణోత్సవాలు జరిపేందుకు అనువైన తేదీని నిర్ణయించడం, పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు పూర్వ విద్యార్థులు చేపట్టాల్సిన కార్యక్రమాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక కమిటీ ఏర్పాటైంది. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన తరువాత దాదాపు మూడు రోజుల పాటు జరిగే పాఠశాల స్వర్ణోత్సవాల తీరుతెన్నులను ప్రకటిస్తామని ఈ సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు వెల్లడించారు. పూర్వ విద్యార్థులు కొంపెల్ల శ్రీనివాస్ శర్మ, మల్లికార్జునరావు, మరిణయ్య, సావిత్రి, లక్ష్మి, నీలవేణి, ప్రసాద్, బాషా, నమ్మి శ్రీనివాస్, ఆదియ్య, మురళి, దత్తు, వీర్రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏజెన్సీలో క్షయ నిర్మూలనకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాథ్

రంపచోడవరం: క్షయ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ నిర్మూలనకు చేపడుతున్న పలు కార్యక్రమాలను సంస్థ కార్యదర్శి జి.సుబ్బరాజు వెల్లడించారు. ఏజెన్సీలో క్షయ నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నామన్నారు. ఏపీ, తెలంగాణ ఎన్‌జీవో కన్సల్టెంట్ పీసీ కాశీనాథ్ మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు స్టాప్ టీబీ పార్టనర్‌షిప్ సహకారంతో సంస్థ పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు 60వేలకు పైగా టీబీ వ్యాధిగ్రస్తులున్నట్టు అంచనా ఉందన్నారు. సంస్థ కార్యదర్శి సుబ్బారాజు మాట్లాడుతూ ఏజెన్సీలో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్షయ లక్షణాలున్న వారిని గుర్తించి ప్రభుత్వ క్షయ నిర్మూలన అధికారులకు తెలియజేసి చికిత్స అందేలా చూస్తున్నామన్నారు. ఇప్పటివరకు పలు మండలాల్లోని సుమారు 400 మంది వ్యాధి బారినపడ్డారన్నారు. ఐటీడీఏ పరిధిలో వనమూలిక వైద్యం చేస్తున్న వైద్యులను 150 మందిని గుర్తించి వారికి క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్షయ వ్యాధిపై గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. క్షయరహిత పంచాయతీగా తీర్చిదిద్దుతామని తీర్మానం చేశామన్నారు. క్షయ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. క్షయ నిర్మూలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

యానాం మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గొలుగొండ: ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలను విక్రయిస్తుండటంపై గొలుగొండ ఎస్‌ఈబీ పోలీసులు ఆదివారం దాడులు చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ సీఐ రాజారావు వివరాల ప్రకారం .. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన కొత్తిన ప్రసాద్ తన ఇంటి వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు(ఫుల్ బాటిళ్లు) ఉన్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశారు. అతడిని అరెస్టు చేసి యానాం(పుదుచ్చేరి)కు చెందిన 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఎవరైనా బాధ్యులు ఉంటే అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మాకవరపాలెం: విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారు మాకవరపాలెం వైపు నుంచి నర్సీపట్నం వెళ్తుండగా, కొండలఅగ్రహారం వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని శనివారం అర్ధరాత్రి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. అక్కడ స్తంభానికి కొద్ది దూరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొని ఉంటే భారీ ప్రమాదం జరిగేది. ఇదిలా ఉండగా స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అప్రమత్తమైన ఆ శాఖ అధికారులు ప్రత్యామ్నాయంగా సరఫరాను పునరుద్ధరించారు.


కారు ఢీకొట్టి విరిగిపోయిన స్తంభం

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వెనుకబడిన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరానికి చెందిన అత్తిలి జగన్‌మోహనరావును ఇటీవల రాష్ట్ర జంగమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయనకు జిల్లా జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చోడవరంలో ఆదివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను శాలువాలు, పూలదండలతో సత్కరించారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన కులాలైన బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందన్నారు. గతంలో బీసీలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన టీడీపీ వారిని అన్ని విధాలుగా అణగదొక్కిందని ధ్వజమెత్తారు. అదేవిధంగా పార్టీకి కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. జంగమ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


కార్పొరేషన్ డైరెక్టర్ జగన్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ.. జంగమ ప్రతినిధులు

ఆటాడుకుందాం రా..!

- అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా వేదికలు
- 6 క్రికెట్ పిచ్‌లు, 8 బ్యాడ్మింటన్, 4 వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు ఏర్పాటు
- వాటర్ పార్క్, ఫన్‌జోన్, గోకార్టింగ్, స్నోవరల్డ్, వీఆర్ గేమ్స్ ఇలా
- ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనేలా ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా పోర్టు స్టేడియం
- మే 1 నుంచి 30కి పైగా యాక్టివిటీస్‌లో భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహణ
- జాతీయ స్థాయిలో కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమాలు



దొండపర్తి (విశాఖ దక్షిణ): రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే గోకార్టింగ్ రేసింగ్ కార్లు.. సాహసాలు క్రీడల ఔత్సాహితుల కోసం అడ్వెంచర్స్ పార్క్.. అలుపెరగని ఆటలకు వాటర్ పార్క్... పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు ట్రాంపోలిన్ పార్క్.. విశాఖలో హిమపాతం అనుభూతిని కలిగించేలా స్నో వరల్డ్.. అద్భుత ప్రపంచాన్ని కళ్లముందే సాక్షాత్కారమిచ్చేలా వర్చువల్ గేమింగ్ జోన్.. క్రికెట్ నుంచి ఆర్చరీ వరకు అన్ని రకాల అవుట్‌డోర్, ఇండోర్ క్రీడలకు సంబంధించిన వేదికలు.. మానసిక ఉల్లాసానికి స్విమ్మింగ్ పూల్.. వాకర్స్ కోసం జాగింగ్ ట్రాక్.. ఇండోర్, అవుట్‌డోర్ జిమ్స్.. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా యాంఫీ థియేటర్.. ఇలా ఒకటేమిటి.. ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం.. అన్నింటికీ వన్‌టాప్ డెస్టినేషన్‌గా పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటి వరకు క్రీడా మైదానంగానే ఉన్న ఈ స్టేడియాన్ని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు స్పోర్ట్స్, ఫన్, అమ్యూజ్‌మెంట్, అడ్వెంచర్స్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు అనేక రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రతి ఒక్కరికీ విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఒక టూరిస్ట్ స్పాట్‌గా స్టేడియంలో సర్వ హంగులు అద్దుతున్నారు.

మే 1 నుంచి భారీ సమ్మర్ క్యాంప్

విశాఖలోనే అతి పెద్ద సమ్మర్ క్యాంప్ నిర్వహణకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ ఎవరూ చేయని విధంగా దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీల సహకారంతో ఒకేసారి 30కిపైగా క్రీడా, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మే 1వ తేదీ నుంచి ఆరు వారాల పాటు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో ప్రత్యేక స్పోర్ట్స్ పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఒకేసారి 1500 వరకు ఈ శిబిరంలో క్రికెట్ నుంచి కర్రసాము వరకు.. టెన్నిస్ నుంచి కుకింగ్ వరకు.. డ్యాన్స్ నుంచి డిబేట్స్ వరకు.. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లలో జాతీయ స్థాయి కోచ్‌లతో క్యాంప్‌లో చేరిన వారికి శిక్షణ ఇవ్వనుంది. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడలపై మక్కువ పెంచడంతో పాటు, క్రీడా నైపుణ్యాన్ని మరింత పదును పెట్టుకోడానికి ఈ శిక్షణా శిబిరం దోహదపడనుంది. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉండనుంది. ఆసక్తి ఉన్న వారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలను ఎంచుకొనే అవకాశముంది. వారానికి రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అభ్యర్థులకు అనువైన బ్యాచ్‌లలో చేరే అవకాశముంది.

క్రీడామైదానంతో పాటు అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా..

పోర్టు స్టేడియాన్ని క్రీడా మైదానంగానే కాకుండా విశాఖలోనే సరికొత్త అమ్యూజ్ మెంట్ హబ్‌గా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒకవైపు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచే సే విధంగా ఇక్కడ అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికలను సిద్ధం చేస్తోంది. క్రికెట్‌తో పాటు 8 బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, 4 వాలీబాల్ కోర్ట్స్‌లను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. అలాగే క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కోచ్‌లను తీసుకువచ్చి ఇక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ పోర్టు స్టేడియాన్ని ఒక క్రీడా వేదికగానే కాకుండా అన్ని వయసుల వారికి అనువైన, ఆరోగ్యం, విహారం, వినోదం పంచే అమ్యూజ్‌మెంట్ హబ్‌గా రూపొందిస్తోంది.

ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో..

ఆరు నెలల్లో పోర్టు స్టేడియాన్ని పూర్తి స్థాయి స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ మారనుంది. పిల్లల కోసం ఫన్ జోన్, ట్రాంపోలిన్ పార్క్, మౌంటేన్ క్లైంబింగ్, స్విమ్మింగ్ పూల్, స్నో వరల్డ్, బాక్స్ క్రికెట్ వంటి సౌకర్యాలు త్వరలోనే అందరినీ అలరించనున్నాయి. అలాగే వాకర్స్ కోసం కూడా జాగింగ్ ట్రాక్‌తో పాటు అవుట్‌డోర్, ఇండోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కళాకారుల ప్రదర్శనలకు అనువుగా యాంఫీ థియేటర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతమున్న కళావాణి ఆడిటోరాయాన్ని మరింత ఆధునీకరించనున్నారు.


పూల్ ఏ : అవుట్‌డోర్
క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ.

పూల్ బీ: ఇండోర్
టేబుల్ టెన్నిస్, చెస్, కరాటే, రైఫిల్ షూటింగ్, టైక్వాండో(బాయ్స్ అండ్ గర్ల్స్), కర్రసాము, ఫెన్సింగ్

పూల్ సీ: ఆర్ట్స్ అండ్ కల్చర్
డ్యాన్స్, మ్యూజిక్, సింగింగ్, యాక్టింగ్, యోగా, పెయింటింగ్, కుకింగ్.

పూల్ డీ: ఎడ్యుకేషన్ అండ్ ఫన్
సైన్స్ పరిశోధనలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం, భారత చరిత్ర, రోబోటిక్స్, ట్రెజర్ హంట్, గార్డెనింగ్, డిబేట్ అండ్ గ్రూప్ డిస్కషన్స్.


ఆర్చరీలో శిక్షణ


వాలీబాల్‌లో శిక్షణ

VISHWANADH SPORTS CLUB

బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్



పోర్టు స్టేడియాన్ని బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా వేదికలే కాకుండా.. అన్ని వయసుల వారిని అలరించి, వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌గా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో మే 1వ తేదీ నుంచి భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా మంది పోర్టు స్టేడియానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో ఆరు నెలల్లో స్పోర్ట్స్, ఫన్ యాక్టివిటీస్ అందరినీ అలరిస్తాయి.

– ప్రమోద్, మేనేజింగ్ డైరెక్టర్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్